అబ్రకదబ్ర..



పావురాన్ని సృష్టించిన మెజీషియన్ బాషా(ఫైల్)

- మెజీషియన్లుగా రాణిస్తున్న పలువురు నగర వాసులు
- నేడు ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం



ప్రపంచ ఇంద్రజాలికుడు పీసీ సర్కార్

డాబాగార్డెన్స్: లేనిది ఉన్నట్టు.. ఉన్నది లేనట్టు చూపించడమే మాయాజాలం. ఇక్కడ ఉన్న వస్తువు.. వేరే చోట కనిపించడం.. కంటికి కనింపించని వస్తువు కళ్లకు కట్టినట్టు చూపడమే మ్యాజిక్. చేతి రుమాల్లోంచి పావురాలు సృష్టించడం.. బొమ్మ గిటారు నుంచి అసలైన గిటార్‌ను సృష్టించి పాప్ సంగీతాన్ని వినిపించడం.. న్యూస్ పేపర్‌లో నీరు పోసి అందులోంచి రకరకాల పువ్వులు, రంగు రంగుల చేతి రుమాళ్లు తీయడం.. వంటి మ్యాజిక్‌లను చేసి ప్రేక్షకులను అబ్బురపరచడంలోనే ఉంది మెజీషియన్ల ప్రతిభ. భారతీయ సంస్కృతి 64 కళల సమాహారం. అందులో ఇంద్రజాలం ఒకటి. ఈ కళకు ప్రత్యేక గుర్తింపు తెచ్చి ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడిగా పేరొందిన పీసీ సర్కార్ సీనియర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఫిబ్రవరి 23న ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు. విజ్ఞానంతో కూడిన వినోదాన్ని అందించడమే తమ లక్ష్యమని మెజీషియన్‌లు చెబుతున్నారు. ఈ కళలో నగరానికి చెందిన పలువురు మెజీషియన్‌లు రాణిస్తూ ఎంతో వినోదాన్ని పంచుతున్నారు. గురువారం ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురి మెజీషియన్ల అనుభవాలు, అభిప్రాయాలు మీ కోసం..



పిల్లలచే మ్యాజిక్ చేయిస్తున్న మెజీషియన్ అన్వర్ బాషా(ఫైల్)

20 మంది మెజీషియన్ల ప్రదర్శన నేడు

ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు డాబా గార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 20 మంది మెజీషియన్లతో ఈ ప్రదర్శన జరగనుంది.

మ్యాజిక్.. నాలుగు విధాలు



ఇంద్రజాలం నాలుగు భాగాలుగా ఉంటుంది. క్లాసిక్, కన్సూరింగ్, క్లోజప్,ఎలీసన్ విభాగాలుగా ఉన్నాయి. పురాతన పద్ధతిలో మామిడి టెంకలు నాటి అప్పటికప్పుడే మొక్కలు పుట్టించడం, వాటికి కాయలు కాయించడం వంటివి క్లాసిక్‌గా పేర్కొన్నారు. ఎదుట వ్యక్తితో మాట్లాడుతూ అతి దగ్గరగా ఇంద్రజాలం ప్రదర్శించడాన్ని క్లోజప్‌గా గుర్తించారు. ఖాళీ డబ్బాల నుంచి వివిధ రకాల వస్తువులు తీయడం ఎలీసన్‌గా.. ఏదైనా ఒక వస్తువు స్వరూపాన్ని మార్చి తిరిగి దాని పూర్వపు స్థితికి తేవడాన్ని కన్సూరింగ్‌గా పిలిచారు. ఏ ఇంద్రజాలికుడైనా వీటిని ప్రదర్శించాల్సిందే. – బి.ఎస్.రెడ్డి, ఇంద్రజాలికుడు

మ్యాజిక్‌తో పాటు కామెడీ తప్పనిసరి



నగరంలో ప్రొఫెషనల్ మెజీషియన్‌గా ఇప్పటి వరకు 4 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. జాదూ సామ్రాట్ అవార్డు పొందాను. ఇండియన్ మ్యాజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గిరిజన, గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో మూఢ నమ్మకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. సాధారణ మ్యాజిక్‌తో పాటు కామెడీ మ్యాజిక్‌లు చేయాలన్నది లక్ష్యం. మూడు పీజీలు చేశాను. ఏయూలో ఎమ్మెస్సీ సైకాలజీ కూడా పూర్తి చేశాను. – అన్వర్ బాషా, మెజీషియన్

స్ట్రీట్ మెజీషియన్ వద్ద ఇంద్రజాలం నేర్చుకున్నా..



ఓ స్ట్రీట్ మెజీషియన్ వద్ద 1971లో ఇంద్రజాల విద్యనభ్యసించాను. దేశం నలుమూలల ప్రదర్శన ఇస్తూ, ఎంతో మంది మన్ననలు పొందాను. గ్రేట్ మెజీషియన్ పీసీ సర్కార్ సన్నిహి తుడ్ని. ఇంద్రజాల ప్రదర్శన ద్వారా వచ్చిన పారితోషికాన్ని అనాథ ఆశ్రమాలకు విరాళంగా ఇస్తున్నాను. మామిడి టెంకను మట్టిలో పాతి, అప్పటికప్పుడు మొక్కను సృష్టించి కాయలు కాయించే మ్యాజిక్‌ను స్టేజీపై ప్రదర్శించడం నా ప్రత్యేకత. – కె.విజయ్‌కుమార్, మెజీషియన్, డిప్యూటీ మేనేజర్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్, వైజాగ్ స్టీల్‌ప్లాంట్

ప్రోత్సహిస్తే అంతర్జాతీయంగా గుర్తింపు



భారతీయ కళల్లో ఒకటైన ఇంద్రజాలం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తుంది. ప్రతి అంశంలోనూ శాస్త్రీయ పరిజ్ఞానం ఇమిడి ఉంటుంది. ఈ కళకు మరింత ప్రోత్సాహం అందిస్తే అంతర్జాతీయంగా మంచి గుర్తింపు పొందవచ్చు. – రవితేజ, క్లోజప్ అండ్ స్టేజ్ మెజీషియన్

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజు వీధిలో ఇటీవల అల్లరిమూకల దాడిలో గాయపడిన కడితి రమణమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం పరామర్శించారు. వారికి జరిగిన అన్యాయంపై ఆరా తీశారు. వైద్య ఖర్చులు, న్యాయవాది ఫీజు కోసం రూ.10వేలు సాయం తన సొంత నిధుల నుంచి అందజేసి, తన ఔదార్యం చూపించారు. ఈ కార్యక్రమంలో 36వ వార్డు కార్పొరేటర్ మేరీజోన్స్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, పార్టీ నాయకులు సుధాకర్, కడియం ప్రసాద్, బోని దేవా, కిషోర్, గౌతమ్, రామరాజు ఎస్ఎల్ఎఫ్ సెక్రటరీ రమణమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



ఎస్ఎస్ఎన్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వేమన సంఘం ప్రతినిధులు

సీతమ్మధార: విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మొదటి మేయర్‌గా ఎస్ఎస్ఎన్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, న్యాయవాది సత్తి సుబ్బారెడ్డి, వేమన సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. దివంగత మాజీ మేయర్ ఎస్ఎస్ఎన్ రెడ్డి 93వ జయంతి సందర్భంగా జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. కార్యక్రమంలో కర్రి రామారెడ్డి, నీలాపు రమణారెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, సంజీవరెడ్డి, సాడి కేశవరెడ్డి, మరడా శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోలా గురువులకు సత్కారం



కోలా గురువులను సత్కరిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్: ఎమ్మెల్సీ అభ్యర్థిగా మత్స్యకార డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. 30వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కేవీఎస్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కోన శంకర్ బుధవారం కోలాను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కె.రామన్నపాత్రుడు, 30వ వార్డు నాయకులు తాడి రవితేజ, ఆనంద్, రామరాజు, రవి, కోడూరు రూప, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి



కరపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డాబాగార్డెన్స్: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని నగర కాంగ్రెస్ నేతలు అన్నారు. జీవీఎంసీ 39వ వార్డు కోటవీధిలో బుధవారం హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర చేపట్టారు. ప్రజలకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిమిడి దేవి, మీసాల సుబ్బన్న, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, బీసీ నాయకులు తోట వాసుదేవరావు, గుత్తుల శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకురాలు సయ్యద్ అబీదా తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీకి ఓటు అడిగే హక్కు లేదు'



మహ్మద్ సాధిక్

డాబాగార్డెన్స్: విశాఖ రాజధాని, ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న టీడీపీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదని ఉత్తరాంధ్ర ముస్లిం మైనార్టీ నాయకుడు, కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుతో పాటు ఆ పార్టీ ఉత్తరాంధ్ర నాయకులు ఉత్తరాంధ్ర ద్రోహులని ధ్వజమెత్తారు. ఏ ఒక్క పట్టభద్రుడు కూడా ఉత్తరాంధ్ర ద్రోహులకు మద్దతు ఇవ్వకూడదన్నారు. విశాఖతో పాటు రాష్ట్రమంతా అభివృద్ధి చెందాలన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రులు వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో నిలిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని సాధిక్ అభ్యర్థించారు.

కళాభారతిలో రామదాసు జయంతి నేడు

మద్దిలపాలెం: భక్త రామదాసు జయంతి వేడుకలను గురువారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలలో భాగంగా సాయంత్రం 6.30 గంటలకు భక్త రామదాసు కీర్తనల గోష్ఠి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సుమారు 200 మంది కళాకారులు పాల్గొన్ని గీతాలాపన చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

'దక్షిణ'లో కోలాహలం



సంపత్ వినాయకుడి గుడి సమీపంలో సందడి

డాబాగార్డెన్స్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గంలో బుధవారం సందడి నెలకొంది. ఊరేగింపులు, బైక్ ర్యాలీలతో పండగ వాతావరణం ఏర్పడింది. తీన్‌మార్ బ్యాండ్, డప్పులు, వాయిద్యాలతో దద్దరిల్లింది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా అధిక సంఖ్యలో అభ్యర్థులు బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. విశాఖ జిల్లా నుంచే గాక విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, పార్వతీపురం(మన్యం), అల్లూరి సీతారామ రాజు జిల్లాల నుంచి నామినేషన్లు వేసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు బలపరిచిన అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేసేందుకు దక్షిణ నియోజకవర్గ పరిధిలోని కలెక్టర్ కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలిరావడంతో సందడి నెలకొంది.

నాయకుల ర్యాలీ

వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఆశీల్‌మెట్ట వద్ద సంపత్ వినాయగర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, వందలాది మంది పార్టీ నాయకులతో ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ బలపరచిన వేపాడ చిరంజీవి పార్టీ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ జంక్షన్ మీదుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. బీజేపీ బలపరిచిన పీవీఎన్ మాధవ్ బీజేపీ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా తరలివచ్చారు. దీంతో పలు ప్రాంతాలు సందడిగా మారాయి.

ఎమ్మెల్సీగా సుధాకర్ విజయమే లక్ష్యం



సమన్వయ కమిటీ సమావేశంలో నియోజకవర్గ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కోరారు. ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ పట్టభద్రుల ఓటర్ల ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని తెలియజేయాలని సూచించారు. వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే సుమారు లక్షన్నర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలను భర్తీ చేశారన్నారు. ఈ విషయాన్ని ఓటర్లకు వివరించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని 14 వార్డుల్లో 14 పోలింగ్ బూత్‌ల్లో విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుగా సీతంరాజు సుధాకర్‌కు వేయించి, అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు వీసం రామకృష్ణ, కనక మహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, పలు వార్డుల అధ్యక్షులు సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు, దళమంతుల మాణిక్యాలరావు, మైకేల్ రాజు, పార్టీ నాయకులు సత్యనారాయణ, మన్యాల శ్రీనివాస్, రామానంద్, నీలకంఠం, బెహరా వెంకటరత్నం, బాపూ ఆనంద్, ముజీబ్‌ఖాన్, బోని దేవా, లండా రమణ, కోన శంకర్, వడ్డాది దిలీప్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

నగరంలో ప్రాంతాలను తెలిపేలా సూచిక బోర్డులు

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: నగరంలో వివిధ ప్రాంతాలను తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాంతాలను తెలిపే సూచిక బోర్డుల ఏర్పాటుతో పాటు పాతబడిన సూచిక బోర్డుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరం ఉన్న చోట్ల జీవీఎంసీ ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్డుకిరువైపులా, సెంట్రల్ మీడియన్‌లో పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించాలని, చెట్లు, ఎలక్ట్రికల్ పోల్స్, గోడలకు ఉన్న ప్రకటనల బోర్డులు తొలగించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బస్టాప్‌లు ఆధునికీకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, గ్రీన్‌బెల్టులకు రక్షణగా ఉన్న గ్రిల్స్ కట్ చేసి రహదారులుగా ఏర్పాటు చేస్తున్నారని, వాటిని పరిశీలించి, చర్యలు చేపట్టాలన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్ కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4 కేజీల గంజాయి, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గంజాయి రవాణా అవుతోందని సమాచారం అందడంతో స్పెషల్ బ్రాంచి ఏసీపీ గంగాధర్ పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న అల్లూరి జిల్లా డుంబ్రిగుడ, కితలంగి పంచాయతీకి చెందిన గొల్లోరి బాబూరావు, జి.మాడుగుల మండలం బీరం గ్రామానికి చెందిన వంతల రమేష్‌ను తనిఖీ చేయగా.. నాలుగు కేజీల గంజాయి బయట పడింది. దీంతో వారిద్దరినీ అరెస్ట్ చేసి, గంజాయితో పాటు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మాతృభాషతోనే వికాసం



విద్యార్థులతో అధ్యాపకులు

కంచరపాలెం: మాతృభాషతోనే మానవ మనుగడ, వికాసం సాధ్యమని నేవీ చిల్డ్రన్ స్కూల్ హిందీ ఉపాధ్యాయిని డాక్టర్ నిర్మల, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం మాతృభాషా వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి, సృష్టి అభినయ క్లబ్ సంయుక్త నేతృత్వంలో విద్యార్థులకు మాతృభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు శిఖ, దియా, కావ్య, సంధ్య, అధ్యాపకులు డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ గౌరీనాయుడు, డాక్టర్ కోటేశ్వరరావు, సిస్టర్ జైన్, ప్రమీల, కావేరి తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన రాఖీ, కాక్టస్ పుష్పాలు



కాక్టస్ పుష్పం



రాఖీ పుష్పం

ఏయూ క్యాంపస్: ప్రకృతి ఉద్యానవనంలో అరుదైన పుష్పాలు విరబూశాయి. ఎడారి ప్రాంతాలలో కనిపించే కాక్టస్ జాతికి చెందిన పుష్పం పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యాన వనంలో కనువిందు చేసింది. ఆస్ట్రోఫైటమ్ ఆస్టెరియాస్ జాతికి చెందిన సీర్పిన్ కాక్టస్ మొక్క తెల్లని రేకలతో ఎంతో అందంగా కనిపిస్తోంది. – అలాగే తీగజాతిలో కనువిందు చేసే పాసిఫ్లోరేసియా కుటుంబానికి చెందిన పర్పుల్ ఫ్యాషన్ ఫ్లవర్‌లు విరబూశాయి. వీటిని రాఖీ ఫ్లవర్‌గా, ఫ్రెండ్‌షిప్ ఫ్లవర్‌గా, మేపాస్ ఫ్లవర్‌గా వివిధ పేర్లతో పిలుస్తారు. ఈ పుష్పాలు జీవ వైవిధ్య ఉద్యానవనంలో సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

గాంధేయ విలువలతో సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధన



రోషిణికి గాంధీజీ పుస్తకాలను బహూకరిస్తున్న చల్లా రామకృష్ణ

ఏయూ క్యాంపస్: సుస్థిర ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి సాధనకు గాంధేయ విలువలు, విధానాలు అవసరమని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కొరటి అన్నారు. బుధవారం ఆంధ్రా యూనివర్సిటీ గాంధీయన్ స్టడీస్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ గాంధీజీ పుస్తకాలను ఆమెకు బహూకరించారు. కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో ఫోన్ల చోరీ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పర్యాటకులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌లో రెండు ఫోన్లు చోరీకి గురయ్యాయి. మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం సాయంత్రం ఇక్కడి బీచ్‌లో గడిపేందుకు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆరుగురు యువతీ యువకులు చేరుకున్నారు. కాసేపు స్నేహితులతో సరదాగా గడిపి బీచ్‌లో స్నానాలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో వారి వెంట తెచ్చుకున్న బ్యాగులు, సెల్ ఫోన్లను కాస్త దూరంలో పెట్టారు. వీరు స్నానాలు చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగుల్లోని రెండు సెల్‌ఫోన్లతో పాటు రూ.3 వేల నగదు, ఏటీఎం కార్డులు తీసుకుని పోయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యా దు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్లోబల్ లీడర్స్‌గా ఎదగాలి



నవీందర్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: యువతరం గ్లోబల్ లీడర్స్‌గా ఎదగాలని లండన్‌కు చెందిన మేనేజ్‌మెంట్ నిపుణుడు నవీందర్ ఆకాంక్షించారు. బుధవారం ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఎంబీఏ విద్యార్థులను ఉద్దేశించి కన్సల్టింగ్ సర్వీసెస్‌కు అవసరమైన నైపుణ్యాలపై ఆయన ప్రత్యేక అతిథి ప్రసంగం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా విభిన్న దేశాలలో తాను అందిస్తున్న కన్సల్టింగ్ సేవలు, విధి విధానాలు, పని తీరు, ప్రగతి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సాధారణ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలతో పాటు, ఐటీ ఆధారిత సేవలు, ఆర్థిక సేవలు అందించే అంశాలపై కార్యాచరణ రూపొందించుకుని పని చేయడంపై వివరించారు. ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉందన్నారు. ఏయూ జియో ఫిజిక్స్ ఆచార్యుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ చేసిన నవీందర్ కప్లిష్ ఏయూ విద్యార్థులకు పలు అంశాల్లో దిశానిర్దేశం చేశారన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని నవీందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఏయూ విద్యార్థులకు నూతన జ్ఞానాన్ని అందించే దిశగా సహకారం అందించాలని వీసీ కోరారు.